సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 4 । మే । 2025

I



బీసీ సంక్షేమ శాఖలో..

బీసీ సంక్షేమ శాఖలో అవినీతికి హద్దు లేకుండాపోతోంది. పదోన్నతులపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- IIలో



వేలానికి వేళ కాలేదా..?

శ్రీముఖలింగం భూముల కౌలువేలం జరగడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

- IIలో

5తో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీ సెట్-2025 దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 5తో ముగియనుంది. ఈ ప్రవేశాల ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత ఈ నెల 15వరకు రూ.1000, 24వ తేదీ వరకు రూ. 4000, చివరి తేదీ 25న రూ.10,000 అలస్య రుసుంతో ఫీజులు చెల్లించాలి.

న్యూస్‌రీల్

టీచర్లకు ఆర్జిత సెలవులు మంజూరుచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇటీవల వెలువడిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వేసవి సెలవుల్లో సైతం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా పనిచేస్తున్న నేపథ్యంలో వారందరికీ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 వరకు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థుల మానసిక స్థితి, మండే ఎండలు, మరోవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యాశాఖ మార్గదర్శకాలు ప్రతిబంధకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా నాటుసారా స్థావరాలెక్కడ ఉన్నా విస్తృతంగా దాడులు జరిపి అరికట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి జిల్లాలో గల స్టేషన్ ఆఫీసర్స్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో 80 అడుగుల రోడ్డు సమీప ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 110 సారా గుర్తింపు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చాలన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 212 ఐడీ కేసులు నమోదై 162 మందిని అరెస్టు చేసి 2231 లీటర్ల సారా, ఏడు వాహనాలను స్వాధీనపర్చుకున్నామన్నారు. 6735 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించేవారిపై 874 కేసులు నమోదు చేసి అంతేమందిని అరెస్టు చేశామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా అధికారి తిరుపతినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ అవార్డుకు ప్రాజెక్టు ఎంపిక



గణిత అవధాని మద్దు తిరుపతిరావు

కంచిలి: మండలంలోని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గణిత అవధాని మద్దు తిరుపతిరావు రూపొందించిన గణిత ప్రాజెక్టు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) వారు నిర్వహించిన అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఆయనకు ఎన్‌సీఈఆర్‌టీ నుంచి సమాచారం వచ్చిందని ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ వారు జనవరి 13న జాతీయ గణిత విద్యా సమావేశాల నిర్వహణ సందర్భంగా దేశవ్యాప్తంగా గణిత ప్రాజెక్టులను ఆహ్వానించారు. అందులో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు 'గణిత ప్రాథమిక కార్యకలాపాల సన్నాహక దశలో విద్యార్థుల పనితీరు అంచనా వేయటానికి బోర్డు గేమ్ ప్రయోగం' అనే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దేశవ్యాప్తంగా 105 ప్రాజెక్టులను ఎంపిక చేయగా.. అందులో మన రాష్ట్రం నుంచి 4 మాత్రమే ఉన్నాయి. అందులో తిరుపతిరావు ప్రాజెక్టు చోటు సంపాదించుకోవడం విశేషం.

శ్రామికులే దేశానికి వెన్నెముక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీధర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రామికులే దేశానికి వెన్నెముక అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు అవసరమైన చట్టాలు, ప్రభుత్వ పథకాలపై వివరించి, న్యాయ సహాయం అందించాల్సిన విధానాలను తెలియజేశారు. కార్మికులు తమ చెమటతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు. 1886 మే 1న అమెరికాలో ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు చేపట్టిన ఉద్యమాన్ని, షికాగోలో హే మార్కెట్ కాల్పులను గుర్తుచేశారు. ఈ చరిత్రను యువతకి తెలియజేసి కార్మికుల హక్కులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, డిప్యూటీ లేబర్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.



ఎక్కడో ఊరవతల ఓ మర్రి చెట్టు.. ఎండన పడి తిరిగే వారిని కాసేపు కూర్చోండర్రా.. అని పిలుస్తూ ఉంటుంది. ఊరి మధ్యన రావి చెట్టు.. ఎర్రటి ఎండకు ఆకులతో గొడుగు పట్టి తన ఒడిలో కూర్చున్న వారికి ప్రాణ వాయువు అందిస్తూ ఉంటుంది. ఇంటివెనుక జామ చెట్టు.. తీయటి ఫలాలు అందించడంతో పాటు సందె వేళ కింద కూర్చుకుంటే చల్లటి గాలిని కానుకగా ఇస్తుంది. అందుకే వేసవిలో చెట్టుతో జట్టు కట్టడం అత్యవసరం.



గంగ్రేడులోని మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు

చెట్టు.. వేసవికి జట్టు

- పచ్చని చెట్లే వేసవి విడిదులు
- పల్లెటూళ్లలో వృక్షాల కిందనే సేద దీరుతున్న ప్రజలు

పొందూరు:

పల్లెటూరు.. సందె వేళ.. మర్రి చెట్టు కింద మకాం.. కాసిన్ని కబుర్లు.. కావాల్సినంత చల్లని గాలి. అంతే వేసవి ఇట్టే గడిచిపోతుంది. చుట్టూ ఎండ తాండవం చేస్తున్నా చెట్టు నీడలో మాత్రం ఏసీ పెట్టినట్టే చల్లటి గాలి వీస్తుంది. అదే ఇప్పుడు పల్లెవాసులను రక్షిస్తోంది. పొందూరు మండలంలోని దళ్లవలస, కోటిపల్లి, మజ్జిలిపేట, గంగ్రేడు, మలకాం, వీఆర్ గూడెం గ్రామాల్లో పెద్ద మర్రి చెట్లు వేసవి విడిదులుగా దర్శనమిస్తున్నాయి. ఈ చెట్లు సుమారు 60 ఏళ్ల నుంచి 200 ఏళ్ల వయస్సు ఉన్నవి. విశాలంగా వ్యాపించిన ఊడలతో నీడ అల్లుకుంటుంది. దీంతో ఎండకు దొరకకుండా పిల్లలు, పెద్దలు వాటి కిందనే సేద దీరుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో చెట్ల కిందకు వచ్చి ముచ్చటించుకునేవారు కొందరు, నిద్రపోయే వారు మరికొందరు, ఆడుకునే పిల్లలు, వలస కూలీలు అక్కడే ఉంటున్నారు.



దళ్లవలసలో చెట్టు నీడలో సేదతీరుతూ...



మజ్జిలిపేటలో మర్రి చెట్టు కింద కూర్చున్న ప్రజలు, పనులు చేసుకుంటున్న కూలీలు

ఎండ నుంచి ఉపశమనం



మాది మలకాం గ్రామం. చిన్న పల్లెటూరు. వేసవి కాలం వచ్చిందంటే గ్రామంలోని ప్రజలు ఈ మర్రి చెట్టుకిందకే కూర్చునేందుకు వస్తుంటారు. ఇక్కడే సేద దీరుతుంటారు. మర్రిచెట్టు వయస్సు సుమారు 200 ఏళ్లు ఉంటుంది. బయట నుంచి వచ్చేవారంతా కచ్చితంగా ఇక్కడ కూర్చొని ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– జాడ అసిరినాయుడు, మలకాం, పొందూరు మండలం

విశాలమైన ప్రాంగణం



మాది గంగ్రేడు. శివారు గ్రామం. నాగావళి నది ఒడ్డున ఉంది. నది నుంచి వచ్చే చల్లని గాలి మర్రిచెట్టు కిందకు వచ్చి మరింత కూల్‌గా మారిపోతుంది. దీంతో పెద్దలు ఇక్కడే నిద్రపోయేందుకు, సేద దీరేందుకు వస్తుంటారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు అనువుగా చెట్టు నీడ ఉంది. ఈ చెట్టు మా గ్రామానికి వరం.

– చింతాడ సూర్యారావు, గంగ్రేడు, పొందూరు మండలం



మలకాంలోని మర్రిచెట్టు కింద సేద తీరుతూ..

గ్రావెల్ విధ్వంసం వాస్తవమే

- సంచాం గ్రావెల్ కొండను పరిశీలించిన వీఆర్‌ఓలు
- సాక్షిలో కథనం వచ్చినా ఆగని తవ్వకాలు
- అనుమతులు లేవని చెప్పి నిలువరించి యంత్రాలను పంపించేసిన వైనం
- డంపింగ్ ప్రాంతానికి వెళ్లే సాహసం చేయని అధికారులు

అధికారుల సాక్షిగా అక్రమం బట్టబయలైంది. సాక్షిలో వార్త ప్రచురితమై జనమంతా చర్చించుకుంటున్నా గ్రావెల్ అక్రమార్కులు మాత్రం తవ్వకాలను ఆపలేదు. వీఆర్‌ఓలు వెళ్లి అనుమతులు లేవని చెప్పి యంత్రాలను నిలువరిస్తే గానీ.. అక్కడ అక్రమ తవ్వకాలు ఆగలేదు. రణస్థలం మండలంలోని సంచాం, అర్జునవలస పరిధిలోని గ్రావెల్ తవ్వకాల విధ్వంసం వాస్తవమేనని అధికారుల పరిశీలనతో స్పష్టమైంది.

సాక్షి ఎఫెక్ట్



అర్జునవలస రెవెన్యూ సంచాం కొండలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంలో వీఆర్‌ఓలు

రణస్థలం:

సంచాం, అర్జునవలస రెవెన్యూ పరిధిలోని గల సంచాం కొండలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రాంతాన్ని సంచాం, అర్జునవలస వీఆర్‌ఓలు డీవీ మురళీధర్, ఎ.చిన్నారావు శనివారం పరిశీలించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు గత నాలుగు రోజులుగా అక్రమంగా వందలాది లారీలతో గ్రావెల్ తరలించుకుపోయిన వైనంపై శనివారం **'కొండను చెరబట్టి గ్రావెల్ కొల్లగొట్టి'** అనే శీర్షికతో 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు సంచాం కొండలో తవ్వకాలు జరిపిన ప్రాంతానికి వెళ్లారు. సాక్షిలో వార్త వచ్చినప్పటికి ఇంకా తవ్వకాలు జరుపుతుండడం చూసి అధికారులే ఆశ్చర్యపోయారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యం తవ్వకాలు జరపడమేమిటని దగ్గరకు వెళ్లి పనులు ఆపి పొక్లెయినర్లు, లారీలను అక్కడి నుంచి పంపించేశారు. అధికారులు కొండను పరిశీలిస్తే చాలా ఎక్కువగానే తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామని, ప్రస్తుతం తహసీల్దార్ ఎన్.ప్రసాద్ అందుబాటులో లేరని వీఆర్‌ఓలు తెలిపారు.



డంపింగ్ ప్రాంతానికి వెళ్లలేదు..

సుమారు వందలాది లోడ్లు గ్రావెల్ తరలించి డంపింగ్ చేసిన ఎన్ఈఆర్ స్కూల్ ప్రాంతానికి అధికారులు పరిశీలనకు వెళ్లకపోవడం కొసమెరుపు. ఎవరైనా సామాన్యుడు ఒక ట్రాక్టర్ గ్రావెల్ పట్టుకుని వెళితేనే అధికారులు ఎన్నో రూల్స్ మాట్లాడి బండిని సీజ్ చేస్తారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తుంటే అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీనికి తోడు అధికారులు పరిశీలనకు వెళ్లినప్పుడు లారీలు, పొక్లెయినర్లు అక్కడే ఉన్నా సీజ్ చేసే సాహసం చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కనికరం లేదాయె..!

కాశీబుగ్గ: పలాసలో డయాలసిస్ సేవలు నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ సంస్థ కిడ్నీ వ్యాధి బాధితులపై కనికరం చూపడం లేదు. సుమారు నాలుగు గంటల పాటు డయాలసిస్ పొందిన తర్వాత చాలా మంది నడవలేని పరిస్థితుల్లో ఉంటారు. వారు రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. నిబంధనల ప్రకారం వీల్ చైర్ సౌకర్యం కల్పించి హెల్పర్స్‌తో సేవలు అందించాల్సి ఉన్నా అవేమీ చేయడం లేదు. దీంతో కిడ్నీ బాధితులకు కష్టాలు తప్పడం లేదు.



భర్త సాయంతో నడుస్తున్న కిడ్నీ బాధితురాలు



వీల్‌చైర్ లేక కిటికీలు, గోడలు పట్టుకుని నడుస్తున్న బాధితురాలు

సమ్మర్ క్రికెట్ కోచింగ్‌కు వేళాయె

- రేపటి నుంచి జిల్లాలో క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లు మొదలు



శ్రీకాకుళం న్యూకాలనీ: సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులకు రంగం సిద్ధమైంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సూచనల మేరకు జిల్లా క్రికెట్ సంఘం ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 5వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణ శిబిరాల్లో క్రికెట్‌పై ఆసక్తి కలిగిన బాలబాలికలు ఎవరైనా హాజరుకావచ్చని జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.

5 కేంద్రాల్లో శిక్షణ..

జిల్లాలో శ్రీకాకుళం జిల్లా కేంద్రం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాలతోపాటు కళింగపట్నం, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం సబ్‌సెంటర్లలో ఈ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఉదయం 6 ఉదయం 8.30 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి 6.30 వరకు సబ్‌సెంటర్లలో నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణను అందించనున్నారు. శిక్షణకు హాజరయ్యే చిన్నారులు, బాలబాలికలకు ఫిట్‌నెస్‌తోపాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ తదితర విభాగాల్లో తర్ఫీదును అందిస్తారు. తల్లిదండ్రులు వారి పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలని సబ్‌సెంటర్ల కోచ్‌లకు అందజేయాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులకు జూన్ ఒకటో తేదీన ఆయా సబ్‌సెంటర్లలో సర్టిఫికెట్లను అందజేయనున్నట్టు వారు వెల్లడించారు.

పుట్టపర్తికి పలాస జీడిపప్పు

కాశీబుగ్గ: పుట్టపర్తి సత్యసాయి బాబా సన్నిధానంలో అందజేసే ప్రసాదం తయారీలో పలాస జీడిపప్పుకు ప్రత్యేక స్థానం దక్కింది. పర్తియాత్రలో భాగంగా జీడిపప్పు, కిస్‌మిస్‌ల మిశ్రమంతో కూడిన 9000 ప్యాకెట్లను శనివారం పలాస రైలు నిలయం నుంచి ప్రశాంతి సూపర్‌ఫాస్ట్ రైలులో తరలించారు. కార్యక్రమంలో పలాస సత్యసాయి విద్యావిహార్ చైర్మన్ మల్లా రామేశ్వరం, ఉపాధ్యక్షులు తాళాసు శ్రీను, సమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమల, శరత్‌బాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



జీడిపప్పు బాక్సులతో ప్రతినిధులు

ఉగ్రదాడి అమానుషం

పహల్గాంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అమానుషమని స్థానికులు అన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలను మట్టుబెట్టాలని ముక్తకంఠంతో ప్రజలు నినాదాలు చేశారు. ఈ మేరకు మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులో శనివారం రాత్రి గ్రామ పెద్దలు, యువత, మహిళలు,చిన్నారులు అంతా కలిసి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు.

–వజ్రపుకొత్తూరు రూరల్



మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

తీరంలో సందడి

- బీచ్ ఫెస్టివల్ ప్రారంభం



ఏటీవీ ఆల్ టెరైన్ వెహికిల్ నడుపుతున్న శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష

సోంపేట: బీచ్ ఫెస్టివల్ సందర్భంగా బారువ తీరం సందడిగా మారింది. రాష్ట్ర స్థాయి సీ కయాకింగ్, స్టాండప్ పాడ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడంతో క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఆసక్తిగా పాల్గొన్నారు. చిన్నారుల కిడ్స్ ప్లే జోన్‌తో పిల్లలు ఆనందంగా గడిపారు. శనివారం ఉదయం యోగాతో బీచ్ ఫెస్టివల్‌ను అధికారులు ప్రారంభించారు. వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి సీ కయాకింగ్ పోటీలు నిర్వహించారు. తీరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. క్రీడా పోటీల్లో విజేతలకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బి.అశోక్ బహుమతులు అందజేశారు. సాయంత్రం చినుకులు పడడంతో సందడి తగ్గింది.



బోటులో షికారు చేస్తున్న సందర్శకులు



బారువ తీరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీ కయాకింగ్ పోటీలు



ఫుడ్ ఫెస్టివల్ స్టాల్ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్లుప్తంగా

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

గార: ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. శనివారం అంపోలు జిల్లా జైలును ఆయన సందర్శించారు. ముద్దాయిల ఆరోగ్య పరిస్థితి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేనివారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆయనతో పాటు న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, జైలు సిబ్బంది ఉన్నారు.

జనావాసాల్లోకి జింక



మున్సిపల్ కార్యాలయం ఆవరణలోకి చొరబడిన జింక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని సూదికొండ, పీర్లకొండ మధ్య ప్రాంతంలో సంచరిస్తున్న జింకల సమూహం నుంచి ఓ జింక దారి తప్పి జనావాసాల్లోకి చొరబడింది. బంగ్లారోడ్డులోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉండిపోయింది. స్థానికులు గుర్తించి కమిషనర్ ఎన్.రమేష్‌కు సమాచారం అందించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భానుమూర్తికి కమిషనర్ సమాచారమివ్వగా సిబ్బంది వచ్చి జింకను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇంతలో పొదల్లోకి వెళ్లిపోవడంతో అందరూ వెనుదిరిగారు.

ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా బుక్కూరు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగ కార్యదర్శిగా బుక్కూరు ఉమామహేశ్వరరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంలకు కృతజ్ఞతలు తెలిపారు.

సెలవుల్లోనే బదిలీలు పూర్తిచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. మే 31 నాటికి అన్ని కేటగిరీల టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని, జూన్ 5 తర్వాత స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం ప్రారంభమవుతుందని గుర్తుచేశారు. అప్పటికే నూతన ఉపాధ్యాయులు పాఠశాలలో జాయినైతే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నూతనోత్సాహంతో చేపట్టడానికి వీలుపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల పని దినాల్లో బదిలీలు జరగడం వల్ల ఉపాధ్యాయులు.. విద్యార్థుల మీద దృష్టిపెట్టే విషయంలో కొంత సతమతమవుతారని విషయాన్ని అధికారులు మర్చిపోవద్దన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

నందిగాం: మండలంలోని ఆకుల రఘునాథపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం వేకువజామున లారీ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కటక్ నుంచి రైలు బోల్టు, నట్లు లోడ్‌తో వచ్చిన లారీ ఆకుల రఘునాథపురం వద్దకు వచ్చే సరికి బస్ ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అజిమ్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్లీనర్ ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



గ్రంథాలయంలో చిన్నారులు, నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం హిందీ పండిట్ రాజశేఖర్, గణిత ఉపాధ్యాయుడు జగదీష్ చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బలగ హడ్కో కాలనీ గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.ఉగ్రసేన ఆధ్వర్యంలో పిల్లలకు నీతి కథలు చెప్పారు. లావేరు శాఖా గ్రంథాలయంలో రిసోర్స్‌పర్సన్ పి.పద్మావతి మాట్లాడుతూ అతిగా సెల్‌ఫోన్ వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరించారు.

బీసీ సంక్షేమంలో..

అడ్డగోలు పదోన్నతులు!

- సీనియారిటీ జాబితాలను పక్కన పెట్టిన వైనం
- నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్ణయాలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బీసీ సంక్షేమ శాఖలో అవినీతి చుక్కలనంటుతోంది. రెండు రోజుల కిందట వసతి గృహ సంక్షేమాధికారులకు పదోన్నతులు కల్పించారు. ఇద్దరు హెచ్‌డబ్ల్యూఓలకు గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1కు ప్రమోషన్ ఇచ్చారు. కానీ సీనియారిటీ పాటించకుండా ఈ పదోన్నతులు కల్పించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీనియర్లను పక్కన పెట్టి జూనియర్లకు గ్రేడ్–1 పదోన్నతులు ఇచ్చారని కొందరు మండిపడుతున్నారు.

వాస్తవానికి ఎమ్మెల్సీ ఎన్నికల ముందే ఈ పదోన్నతులు ఇవ్వాల్సి ఉంది. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని, వారిపై ఉన్న క్రమశిక్షణ అంశాలను దృష్టిలో పెట్టుకుని పదోన్నతులు కల్పించాలి. కానీ ఈ నిబంధనలేవీ పాటించలేదని తెలుస్తోంది. పదోన్నతులు కల్పించే ముందు సీనియారిటీ జాబితా విడుదల చేయాలి. ఆపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి. ఈ సారి కూడా సీనియారిటీ జాబితాపై నాలుగు అభ్యంతరాలు వచ్చాయి. కానీ వాటిని పట్టించుకోకుండా 2008 నాటి సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని పదోన్నతులు కల్పించారు. ఇది పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకమని సిబ్బంది అంటున్నారు. అయితే ఎవరూ పదోన్నతులపై నోరు మెదపడం లేదు. డీబీసీ ఆదేశాల మేరకు అడ్డగోలుగా ఫైలును పెట్టి పదోన్నతులు కల్పించారని ఆరోపించారు.

అవుట్ సోర్సింగ్ సంగతేంటి..?

ఈ బీసీ సంక్షేమంలో ఆరు కారుణ్య నియామకాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ ఫైల్‌కి సంబంధించిన అన్ని ప్రక్రియలు ఎమ్మెల్సీ ఎన్నికల ముందు పూర్తయ్యాయి. అయితే కావాలనే జాప్యం చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఈ నియామకాలు చేయలేదు. ఎన్నికల కోడ్ పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ నియామకాలు జరగలేదు. దీంతో వారు రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంత్రి సిఫార్సులు చేయించుకుని వచ్చినా జిల్లా అధికారి కనికరించడం లేదు. కారుణ్యంలో కూడా కాసులు దండుకునే స్థాయికి దిగజారిపోయారని సిబ్బంది అంటున్నారు.

పదోన్నతుల్లో చేతివాటం

గ్రేడ్–2 హెచ్‌డబ్ల్యూఓ నుంచి గ్రేడ్–1 వసతి గృహ సంక్షేమాధికారులుగా పదోన్నతులు పొందేందుకు రూ.లక్షల్లో చేతులు మారినట్లు ఆ శాఖ సిబ్బందే ఆరోపిస్తున్నారు. ఒక్కో పదోన్నతిపై రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ పదోన్నతులు పొందిన వారిలో ఒకరు ఈ ఏడాది ఆగస్టులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అంతే కాకుండా సంఘ నాయకులుగా ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్నందునే ప్రమోషన్ వచ్చిందని మిగిలిన అధికారులు చెబుతున్నారు. సీనియారిటీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రమోషన్లలో అవకతవకలు, అవినీతి వ్యవహారాలు, అడ్డగోలు పనితీరు వంటివి బీసీ సంక్షేమ శాఖకు పరిపాటిగా మారిందనే అపవాదు ఉంది. జిల్లాకు చెందిన మంత్రి పేరు చెప్పి, ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఎవరు పదవుల్లో ఉన్నా వారి పేరును వాడుకుని కలెక్టర్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంధపు చెట్లు నరికివేతపై ఫిర్యాదు



మసీదు వద్ద మతపెద్దలతో కలిసి చెట్లను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని సూర్యమహల్ సమీప జామియా మసీదు వద్ద గంధం చెట్ల నరికివేతకు అంశం శుక్రవారం వెలుగులోకి వచ్చిన సంగతి విధితమే. శుక్రవారం నాటికి ఒక చెట్టునే తరలించారనుకున్న మత పెద్దలు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అటవీశాఖ అధికారులతో కలసి మొత్తం 12 ఎకరాలను కలియదిరగ్గా మరో మూడు చెట్లు నరికివేతకు గురై మాయమైనట్లు నిర్ధారణకొచ్చారు. ఒకటో పట్టణ పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు సైతం శనివారం ఈ ఘటనపై ఆరా తీశారు. ఎస్‌ఐ ఎం.హరికృష్ణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మొత్తం 12 ఎకరాల్లో కొబ్బరి, టేకు, గంధం, ఇతర చెట్లు అనేకమున్నాయని, గంధం చెట్లు నరికివేయడం ఘోరమని, చివరిసారిగా కొబ్బరి, టేకు చెట్లు ఫలసాయాన్ని వేలం పాట ద్వారా దక్కించుకున్న సర్ఫరాజ్ భయ్యాపై అనుమానాలున్నాయని న్యాయవాది ఎం.అసదుల్లా, ఎం.ఏ.రఫీ, జాఫర్ ఘోరీ, బాషా, రవూఫ్ ఖాన్, ఆర్.టి.ఖాన్, అమానుల్లా, ఢిల్లీఖాన్, షేక్ మదీనాలు అనుమానం వ్యక్తం చేశారు. అటవీశాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సాధిక్ మాట్లాడుతూ రంజాన్‌తో పాత కమిటీ కాలం ముగియడంతో ప్రస్తుతం తానే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాని, శుక్రవారం సమాచారం మత పెద్దల ద్వారా చేరిందని, శనివారం నాలుగు చెట్లు పోయినట్లు లిఖితపూర్వక ఫిర్యాదు అందడంతో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డు పరంగా కేసు నమోదు చేస్తామన్నారు. అటవీశాఖ శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ సాయిరాం మహాపాత్రో మాట్లాడుతూ రంపంతో తొలగించిన ఆనవాళ్లున్నాయని, వాటిని శ్రీగంధం చెట్లుగా నిర్ధారించామన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

రసాభాసగా పంచాయతీ నిధుల విచారణ



ఘర్షణకు దిగిన ఇరువర్గాలు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట పంచాయతీ నిధుల దుర్వినియోగంపై శనివారం నిర్వహించిన విచారణ రసాభాసగా మారింది. పంచాయతీలో 6వ అంశం నుంచి 11వ అంశం వరకు ఖర్చుచేసిన మెటీరియల్‌కు సంబంధించి రూ.2 లక్షల 70 వేల నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఈ ఏడాది జనవరి 6న పర్వతాలపేటకు చెందిన బెవర మల్లేశ్వరరావు కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అదే నెల 31న ఈఓపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు పంచాయతీలో విచారణ నిర్వహించి, ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఆ నివేదికల ప్రకారం సచివాలయంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు డీఎల్‌పీఓ ఐ.వి.రమణ శనివారం గ్రామానికి వచ్చారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. వ్యక్తిగత దూషణలు, తిట్ల దండకంతో సభలో గందరగోళ స్థితి ఏర్పడింది. దీంతో అధికారులు తలోదిక్కుకు పరుగులు తీశారు. ఒకానొక దశలో ఇరువర్గాలు కొట్లాటకు దిగే పరిస్థితులు కూడా ఉత్పన్నమయ్యాయి. ఇంతలో అధికారులు కల్పించుకుని ఇరువర్గాలు సహకరిస్తేనే విచారణ నిర్వహిస్తామని చెప్పి బయటకు వచ్చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామారావు, సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేలానికి వేళ కాలేదా?



శ్రీముఖలింగం దేవాలయం

- ఏడాదిన్నరగా జరగని శ్రీముఖలింగం భూముల కౌలు వేలం
- అధికారులు నిర్లక్ష్యం వీడాలంటున్న రైతులు
- జాప్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి

జలుమూరు : ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో భూముల సాగు వేలం జరగక ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఏడాదిన్నర కావస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలం జరగడం లేదు. శ్రీముఖలింగేశ్వర స్వామి పేరిట సుమారు 24 ఎకరాలు సాగు భూమి ఉంది. మూడున్నరేళ్ల క్రితం ఎకరాకు రూ.21 వేలు చొప్పున ముందు కౌలుకు పాట పాడేవారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఓసారి స్వామివారి భూములకు సంబంధించి దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించేవారు. ఎక్కువ మొత్తం పాడిన రైతులకు వాటి సాగుకు అనుమతిచ్చేవారు.

జాప్యమెందుకో?

దేవదాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏడాదిన్నర గడుస్తున్నా పాట నిర్వహించడంలేదని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. గత ఏడాదితోపాటు ఈ ఏడాది కూడా కౌలుసాగుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే దేవదాయ శాఖ నుంచి మాత్రం ఎటువంటి పాట నిర్వహించడం లేదని రైతులు చెబుతున్నారు. వేలం నిర్వహించి ఇందులో కొంత భాగం మొత్తం ముందుగానే బ్యాంక్ ఖాతాలో జమ చేయాలి. అన్ని నిబంధనలకు లోబడి కౌలు వేలం పాడేందుకు ఈ ఏడాది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ కాలం కూడా ప్రారంభమైంది. ఇదే సమయంలో వేలం నిర్వహిస్తే ముందస్తు పనులు చేసేందుకు వీలు కలుగుతుందని రైతులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం..

శ్రీముఖలింగేశ్వర ఆలయ భూములు కౌలుకు సంబంధించి దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. అక్కడి నుంచి అనుమతి వచ్చాక కౌలుకు వేలం నిర్వహిస్తాం.

– పి.ప్రభాకరరావు, ఈఓ, శ్రీముఖలింగం దేవస్థానం

ముగ్గురిపై కేసు నమోదు

నందిగాం: మండలంలోని రౌతుపురం గ్రామానికి చెందిన బెవర పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త బెవర నందేశు, బావ బెవర లక్ష్మీనారాయణ, అత్త బెవర పున్నమ్మపై శనివారం కేసు నమోదు చేశారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మావతికి నందేసుతో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన నందేసు తిడుతూ కొడుతుండటంతో పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం నందేసు, లక్ష్మీనారాయణ, పున్నమ్మలు ఆమె ఇంటికి వెళ్లి తిరిగి రమ్మని పిలవగా ఆమె నిరాకరించింది. దీంతో ముగ్గురూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతోంది. పద్మావతి ఫిర్యాదు మేరకు ముగ్గురిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

బెయిల్‌పై వచ్చిన వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామానికి చెందిన పిర్ల రామారావు (48) శుక్రవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరిలో అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచార యత్నం చేసి పోక్సో కేసు కింద రామారావు జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 29న బెయిల్‌పై గ్రామానికి చేరుకున్నా ఇంట్లో ముభావంగా ఉండేవాడు. శుక్రవారం రాత్రి తన నివాసానికి ఎదురుగా ఉన్న పాడుబడిన ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఉదయం తన భర్త కనిపించకపోవడంతో ఎదురుగా ఉన్న ఇంట్లో వెతకగా రామారావు మృతి చెందినట్లు భార్య జయమ్మ గుర్తించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

బస్సును ఢీకొట్టిన లారీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం తర్లిపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. పలాస నుంచి విశాఖపట్నం వైపు సుమారు 30 మంది ప్రయాణికులతో వెలుతున్న బస్సును తర్లిపేట సమీపంలో ఓ టిప్పర్ లారీ ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ముందుభాగం అద్దం విరిగిపోయింది. అయితే బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



బోయిన కామేశ్వరరావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో కాకితోట వద్ద శనివారం ఉదయం గుణుపూర్ నుంచి పూరీ వెళుతున్న రైలు ఢీకొని పాతపట్నం మేజర్ పంచాయతీ శివశంకర్ ఒకటో వీధికి చెందిన బోయిన కామేశ్వరరావు(57) మృతి చెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. ఈయన పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు కూడలిలో పకోడి బండి నడుపుతూ జీవనం సాగించేవాడు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు. కామేశ్వరరావుకు భార్య బోయిన రవణమ్మ, కుమారుడు సంతోష్‌కుమార్ ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకున్న తాతారావు

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లి గ్రామంలో కొయ్యి తాతారావు (66) అనే వ్యక్తి శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన విశాఖపట్నంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబంతో ఉంటున్నాడు. ఈ నెల 1న పెన్షన్ తీసుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. మద్యానికి బానిస కావడం, అనారోగ్య సమస్యలు ఉండటంతో మనస్తాపం చెంది పక్కనే గల తోటలోకి వెళ్లి లుంగీతో ఉరి వేసుకున్నాడు. అటుగా వెళ్తున్న ఉపాధి వేతనదారులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. తాతారావుకు భార్య పార్వతి, కుమార్తె ఉన్నారు. పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీహెచ్‌ఓల సమస్యలు పట్టవా?



సీహెచ్‌వోల ధర్నాలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది పేద ప్రజలకు వైద్యసేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమంటే కూటమి ప్రభుత్వం కనీసం కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ నాయకురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. కొన్ని రోజులుగా మండుటెండలో ర్యాలీలు, ధర్నాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శ్రీకాకుళం నగరంలో మహాత్మాజ్యోతిరావుపూలే పార్కు వద్ద జరుగుతున్న ధర్నా వద్దకు వెళ్లి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌ఓలు రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలన్న జీవోను వెంటనే అమలుజేయాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. పని ఆధారిత ప్రోత్సాహాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లీనిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుమతి, జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ రాజీవ్, జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం చలో కలెక్టరేట్



కాశీబుగ్గ బస్టాండ్ వద్ద జీపుజాతాలో మాట్లాడుతున్న కోనారి మోహనరావు

కాశీబుగ్గ: పలాస మండలం రేగులపాడు వద్ద చేపట్టిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను త్వరతగతిన పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు, పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు తాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న కలెక్టర్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. శనివారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద జీపుజాగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను త్యాగం చేసిన రైతుల నిర్వాసితుల కాలనీల్లో నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. గొట్టాబ్యారేజ్ ఆధునీకరణకు రూ.1600 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వంశధార నదిని బాహుదా నదితో అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించాలని కోరారు. మందస మండలం గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్ చేసి మహేంద్రగిరి నుంచి వచ్చిన నీటిని గోపాలసాగరానికి మళ్లించాలన్నారు. నారాయణపురం ఆనకట్ట ఆధునీకరణ చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా శివారు భూములకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, వి.పసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.భాస్కరరావు, వాసు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన



డొంకూరు వంతెనకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఇచ్ఛాపురం రూరల్/సోంపేట: బూర్జపాడు నుంచి డొంకూరు మత్స్యకార గ్రామం మధ్య రెండు నూతన వంతెనల నిర్మాణానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బూర్జపాడు నుంచి పెద్ద లక్ష్మీపురం వరకు 5.45 కిలోమీటర్ల పొడవున రూ.486 లక్షలతో ప్రధాన మంత్రి సడక్ యోజన కింద తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. అదే సమయంలో పీఎంజీఎస్‌వై పథకం ద్వారా డొంకూరు ఉన్నత పాఠశాల వద్ద నూతన వంతెన నిర్మాణానికి రూ.6కోట్ల 30 లక్షలు, బూర్జపాడు ఉప్పుటేరు(కాజ్‌వే)పై రూ.10 కోట్ల 50 లక్షలతో మరో వంతెన నిర్మాణానికి రెండు సార్లు టెండర్లు వేసినప్పటికీ కంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే నిధులతో శనివారం వంతెన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జిల్లాలో 110 మత్స్యకార గ్రామాల వద్ద మత్స్య సాగర పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.4కోట్లు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ తదితరులు పాల్గొన్నారు. సోంపేట మండలంలోని కొండిరేవు వంతెన, మహేంద్ర తనయ వంతెనలకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బి.అశోక్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ యర్ర రజని, బారువ గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన టాటా ఏస్ వాహనం
- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీనివాసరావు (ఫైల్)



ఘటనా స్థలంలో శ్రీనివాసరావు, సింహాచలం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం నుంచి కింతలి మిల్లుకు వెళ్లే దారిలో 16వ నంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామానికి చెందిన అడపా శ్రీనివాసరావు(39), బాలి సింహాచలం బైక్‌పై శనివారం సాయంత్రం శ్రీకాకుళం బయలుదేరారు. బైపాస్ రోడ్డులో జరజాం సమీపంలో ఆగి ఉన్న కారును తప్పించుకుని వెళ్తుండగా వెనుక నుంచి టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. బైక్‌ను ఈడ్చుకు వెళ్లటంతో బండి నడుపుతున్న శ్రీనివాసరావు, వెనుక కూర్చున్న సింహాచలం రోడ్డుపై తుళ్లిపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. తలకు బలమైన గాయాలు కావటంతో శ్రీనివాసరావు మృతి చెందగా, అపస్మారక స్థితికి చేరిన సింహాచలంను మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. బంధువులు శ్రీకాకుళంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. శ్రీనివాసరావు వ్యవసాయం ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎచ్చెర్ల ఎస్సై–2 నక్క కృష్ణారావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.